# చింతతోపు ఎర్రబడింది

రుద్రారం వూరు పేరు చెప్పగానే రుద్రయ్య పేరు గుర్తుకొస్తుంది. ఒక్క ఆ ఊళ్ళోనే కాదు. చుట్టుపట్ల ఇలాకా లన్నింటికీ ఇది సుపరిచయమే. అందరి నోట్లో నానేమాట 'రుద్రయ్య'. పేరులో రౌద్రం చోటుచేసుకున్నా ప్రజలందరి గుండెలు ఈ మాట వినగానే భక్తిప్రపత్తుల్తో తరగలెత్తుతాయి.

అసలు ఆ ఊరుకి 'రుద్రయ్య' అనే మూలపురుషుడి పేరు స్థిరపడిందని ప్రతీతి. ఆయనే ఆ గ్రామాన్ని నెలకొల్పారట. అంతే కాదు. అప్పట్లో ప్రతి కుటుంబానికీ కొద్దో గొప్పో పొలం కూడా దానం చేశాడట. అంతటి వదాన్యుడి వంశం అందరికీ ఆరాధ్యం కావడంలో విశేషం లేదు.

ఆ వంశంలో ఎవ్వరికీ అంతుపట్టని ప్రకృతి వైచిత్రి ఒకటి చోటు చేసుకుంది. ఒకరు మహనీయుడుగా వర్ధిల్లితే ఆయన పెద్ద కొడుకు ఏదో ఒక దుర్లక్షణానికి ప్రతిరూపంగా నిలుస్తున్నాడు. అయితే అలాంటి దుర్మార్గుడి పెద్ద కొడుకు మళ్ళీ వంశప్రతిష్ఠ అద్భుతంగా నిలబెట్టే సజ్జను డవుతాడు.

ఈ వైపరీత్యాన్ని అధ్యయనం చేయడానికి ఎందరో శాస్త్రవేత్తలు అవిశ్రాంత కృషి సాగిస్తున్నారు. జన్యు విజ్ఞానంలో ప్రపంచ ప్రసిద్ధు లైన వారెందరో ఆ గ్రామం సందర్శించి సుదీర్ఘ పరిశీలనలు జరిపారు. రాజస్థాన్ విశ్వవిద్యాలయం మనో విజ్ఞాన నిపుణులు ఎవరో ఒకరు ఈ గ్రామంలో తారస పడక మానరు. అమెరికా మొదలైన దేశాల నుంచి కూడా శాస్త్రజ్ఞులు వస్తూనే ఉంటారు. ఇంటర్వ్యూలు తరచు జరుగు తూనే ఉంటాయి. అయినా ఇలా ఎందుకు జరుగుతుందో ఎవరూ తేల్చి చెప్పలేక పోతున్నారు.

ఇప్పటి తరం కూడా ఇలాగే ఉంది. తండ్రి రుద్రయ్య చాలా ఉన్నత వ్యక్తి. ఆయన పెద్ద కొడుకు మహేశ్వరరావు. ఏరికోరి 'మ' కారంతో ప్రారంభం కావడమే కాకుండా ఇలవేల్పు పరమశివుడి దివ్య నామం కలిసి వచ్చేటట్లు రుద్రయ్య కొడుక్కి అలా నామకరణం చేశాడు.

దుర్వ్యసనాలకు దూరంగా ఉంచాడు. అత్యుత్తమ విద్య సమ కూర్చాడు. కొడుకు మంచి మార్కులతో బి.ఎ. పాసైతే రుద్రయ్య సంతోషం కట్టలు తెంచుకుంది.

కొడుకులో తరతరాల నుంచి శాపంగా వస్తున్న దుర్నీతి లక్షణాలు తండ్రి కంట పడకపోవటంతో మహాశివుడు కటాక్షించాడని కోటి దండాలు పెట్టాడు. మేరు శిఖరం ఎక్కినంత సంబరం కలిగించి.

వేసవి సెలవుల కొచ్చిన మహేశ్వరరావు నిజస్వరూపం బయట పడగానే రుద్రయ్య ఉన్నపళంగా అంతెత్తు శిఖరం నుంచి దిగుళ్ళ

లోయలోకి దొర్లిపడ్డాడు. కొడుక్కి పేరులో మాత్రం శంకరత్వం నిండి ఉంది. ఇక నిలువెల్లా స్త్రీ లోలత్వం తాండవిస్తోంది. ఎం.ఏ. పూర్తి అయ్యాకే పెళ్ళిచేసుకుంటానని భీష్మించుక్కూర్చున్నాడు. అమ్మాయిల వేట మాత్రం అంతు లేకుండా సాగిస్తున్నాడు.

దేవుడిలాంటి రుద్రయ్య గారి పెద్ద కొడుకు మహేశ్వర్రావు ఊళ్ళోకి వస్తున్నాడంటేనే ఈడు వచ్చిన ఆడపిల్లల తల్లిదండ్రుల గుండెలు గుభేలు మంటాయి. రోజొక యుగంలా గడుస్తుంది.

పట్నం హాస్టల్లో వాళ్ళెలా వేగుతున్నారో గాని ఎం.ఏ. మొదటి సంవత్సరం అయ్యాక వేసవి సెలవలకని రుద్రారం వచ్చిన మహేశ్వర్రావుని నరమాంసం మరిగిన పెద్ద పులిలా చూస్తున్నారా ప్రజలు. రెక్కల మాటున పిల్లల్ని దాచుకుని గ్రద్ద తన్నుకు పోకుండా కాపాడే కోడిపెట్టల్లా ఉన్నారా ఊరి తల్లులు.

ఆ ఊరికి నడయాడే దైవం రుద్రయ్య. బీదా బిక్కీ జనాన్ని కంటికి రెప్పలా చూసే దయానిధి. అందుకే మహేశ్వర్రావుపైన అందరికీ జాలి. కానీ చూసి చూసి ఆడపిల్లల్ని ఎర పెట్టలేరుగా?

అందంలో మహేశ్వర్రావు మన్మథుడు. మాటకారి. కాసేపు అతనితో ఒంటరిగా మాట్లాడితే ఎంతటి ఆత్మ నిగ్రహం ఉన్న ఆడపిల్లైనా తనను తాను మరిచి నాగస్వరానికి తలూపే నాగమై పోతుంది. పైగా వినయ విధేయతలూ, వచోగుణం - అతడలాంటి వాడంటే నమ్మ శక్యం కాదు.

మోతుబరి కుటుంబాలైతే తమ పిల్లల్ని వీధిలో అడుగు పెట్టకుండా కాపాడుకోగలుగుతాయి. రెక్కాడితేగాని డొక్కాడని పేద వాళ్ళకిది చెల్లుబాటు కాదు.

అందరి మాటా ఎలా ఉన్నా రంగస్వామికి మాత్రం ప్రాణాంతకమైపోయింది. క్రితం సారి వేసవి సెలవలకు వచ్చినప్పుడే మహేశ్వర్రావు తన కూతురు గౌరితో మాటలు కలిపే ప్రయత్నం చేశాడు.

ప్రయత్నమే కాదు. ముమ్మాటికీ మాట్లాడాడు కూడా. ఆ సంగతి గౌరే చెప్పింది. కాని మాట్లాడినంత మాత్రాన తాను లొంగిపోతానని కల్లో కూడా అనుకోవద్దని తండ్రికి హామీ ఇచ్చింది. తల్లి లేని పిల్ల గౌరి. రెండెకరాల మాగాణిని నమ్ముకుని గౌరవంగా పేదరికంలోనే జీవితం సాగిస్తున్నాడు రంగస్వామి.

చింతతోపు వెనకాల ఉన్న పొలంలో అపరాలు వేశాడు. పంట ఏపుగా ఉంది. కోతకు వస్తోంది. ఆకతాయి మూక పంట పీక్కుపోకుండా రాత్రుళ్లు మంచెపైనే ఉండక తప్పదు. ఇంట్లో గౌరి ఒక్కతే ఉన్నా పక్క ఆడవాళ్ళంతా సాయంగా ఉంటారు. ఆ భయం లేదు. ఎటొచ్చీ గౌరి అన్నం పట్టుకొచ్చి ఇచ్చి వెళ్ళేటప్పుడే రంగస్వామి భయపడేది. అంతకీ పొద్దు గుంకక ముందే ఇంటికి పంపేస్తుంటాడు.

గౌరి యవ్వనంలోకి అడుగు పెట్టింది. కొంచెం నలుపైనా యమునలా, కస్తూరిలా సమ్మోహనంగా ఉంటుంది. స్నిగ్ధ సౌందర్యం. కపటం లేని తెల్లని చూపులు.

క్రితంసారి తన యత్నం వీగిపోయినందుకు మహేశ్వర్రావు అంతులేని మథనపడ్డాడు. ఈసారి చేయి జారిపోతే తన జన్మకు అర్థం లేదనుకున్నాడు. గౌరి పొలం వెళ్ళి వచ్చే సమయాలు అతిజాగ్రత్తగా గమనించాడు. ఎక్కువ మంది జనం తిరుగుతూ ఉండని చోట్లన్నీ గుర్తు పెట్టుకున్నాడు.

ఒక రోజు చింతతోపు దగ్గర గౌరిని చూసి "బావున్నావా" అని చిరునవ్వుతో పెద్ద మనిషిలా పలకరించాడు.

"తమ దయవల్ల బావున్నాం దొరా!" వినయంగా జవాబిచ్చింది సాగిపోతూనే.

"ఎందుకిలా కష్టపడడం - నువ్వు!" ఏదో చెప్పాలనుకున్నాడు మహేశ్వర్రావు. బండి వస్తున్న గంటల చప్పుడు విని విరమించుకుని మరో దారి వెంట వెళ్ళిపోయాడు.

ఆ సంగతి గౌరి రంగస్వామితో చెప్పి "అయ్యా! నేను రంగ స్వామి కూతుర్ని. నిప్పుని ముట్టుకుంటే కాలకపోవచ్చు గాని అయ్యా! నీ కూతురితో వెకిలి వేషాలేస్తే...." ధైర్య రూపిణిగా చెప్పింది.

సంతోషంతో రంగస్వామి గుండె ఉప్పొంగింది. గుబురు మీసాల వెనక చిరునవ్వులు చెంగలించాయి.

ఆ రాత్రి మహేశ్వరరావుని మదన జ్వాలలు ముట్టడించాయి. ఒక్క రోజు వృథా చేస్తే ఒక జీవిత కాలమే బూడిదలో పోసినట్టవుతుం దని భావించాడు. మర్నాడు తాను చేయవలసిన సాహసం గురించి నిర్ణయించుకున్న తర్వాతే కంటికి కొద్దిగా కునుకు పట్టింది.

మహేశ్వరరావు వాలకాన్ని గౌరి తేలికగా పసికట్టింది. తాటాకుల చప్పుళ్ళకు బెంబేలు పడే కుందేలు కాదు గౌరి. రుద్రారం మట్టిలోని స్థైర్యాన్ని అణువణువునా జీర్ణించుకున్న సాహసమూర్తి. ఒక నిర్ణయానికి వచ్చింది.

మర్నాడు యథాప్రకారంగానే తండ్రికి అన్నం ఇచ్చి కాసేపు కబుర్లు చెప్పి ఇంటి ముఖం పట్టింది. చేతిలో ఉన్న బాణాకర్ర మధ్య మధ్య గిరగిరా తిప్పుతూ వస్తోంది చింతతోపు వైపు.

అక్కడే మాటేసి ఉన్న మహేశ్వరరావు ఆమె నడక చూశాడు. యవ్వనం వరదై పొంగి ముందుకు దూకి వస్తున్నట్టనిపించింది. చింతతోపు వెనకాల సూర్యుడు దాక్కుండి పోతున్నాడు.

గబగబా తోపు దాటి వస్తుండగా ఒక చెట్టు పక్క నుంచి హఠాత్తుగా మహేశ్వరరావు గౌరి చేయి పట్టుకుని గట్టిగా గుంజాడు. ఆ విసురుకు గౌరి చేతిలో ఉన్న కర్ర జారిపోయింది. గౌరి వెల్లకింత లుగా కింద పడింది. ఆవురావురు మంటున్న పులి మాదిరి మహేశ్వరరావు గౌరి మీదికి లంఘించాడు. బలం కూడగట్టుకుని గౌరి అతడి పట్టు విడిపించుకుని గట్టిగా తోసింది. ఆ తోపుతో మహేశ్వరరావు అవతల పడ్డాడు. గౌరి మెరుపు తీగలా లేచి కర్ర తీసుకుని "ధీరా! ధీరా!

నన్ను బలవంతం చేయాలనుకున్న వాడెవడూ మళ్ళీ మనిషిలా బతకలేడు దొరా!" అంటూ కర్రతో దబదబా బాదింది.

మహేశ్వర్రావు గిలగిల కొట్టుకుంటున్నాడు.

గౌరి మట్టి దులుపుకుని ఇంటికెళ్ళి పోయింది. సూర్యుడు సిగ్గుతో పూర్తిగా కిందకి జారిపోయాడు. ఆగ్రహంతో చింతతోపు ఎర్రబడింది!

మహేశ్వర్రావు ఎలాగో దేక్కుంటూ చింతతోపు దాటి బాట చేరుకున్నాడు.

లేనిపోని గాంభీర్యం తెచ్చి పెట్టుకుని ప్రాణాలు ఉగ్గపట్టుకుని ఎవరిదో బండి మీద ఇంటికి వెళ్ళాడు. రుద్రయ్యకి సంగతి అర్థం కాలేదు. మహేశ్వర్రావు మాత్రం ఆ రాత్రంతా యమయాతన అనుభవించాడు. మర్నాడు కారులో పట్నం తీసుకువెళ్ళి పెద్ద డాక్టరుకి చూపించారు.

ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేదనీ, అయితే మహేశ్వర్రావుకు పిల్లలు పుట్టే యోగ్యత మాత్రం పోయిందనీ డాక్టరు పెదవి విరిచాడు.

ఎంత రహస్యంగా ఉంచినా ఈ వార్త ఆనోటా ఆనోటా పాకి అందరి చెవులకూ ఎక్కింది. పైకి అయ్యో అని సానుభూతి ప్రకటించినా ఇక రుద్రయ్య వంశంలో చీడపురుగులు పుట్టే ప్రమాదం శాశ్వతంగా తొలగిపోయిందని గుండె బరువు దించుకోని వాళ్ళెవరూ లేరంటే ఆశ్చర్యం లేదు!

అప్పట్నుంచి రుద్రారానికి శాస్త్రవేత్తలు వచ్చే అవకాశం కూడా పోయింది.

*

(1991)